మీ బుద్ధిలో ఎన్ని దోషాలు ఉన్నా, ఎన్ని బలహీనతలు ఉన్నా ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే ధృడనిశ్చయం నీకు ఉంటే నిన్ను బాగు చేసే బాధ్యత నాది అని పరమాత్మ చెపుతున్నాడు. భగవంతుడు చెప్పిన మాటను ప్రమాణంగా తీసుకొని భగవంతుడిని చేరుకోవాలి. మనం సబ్జక్టు ప్రోపర్‌గా అర్థం చేసుకొంటూ ఉంటే, భగవంతుని పాదాలవైపు జరుగుతూ ఉంటే మనలో బండెడు దుఃఖం ఉన్నా అది అంతా ఆనందంగా మారిపోతుంది. మీకు ఎన్ని అంతస్థులు ఉన్నా, ఎన్ని వైభవాలు ఉన్నా, మీ జీవితాలు ఎంత పచ్చగా ఉన్నా ఆత్మ యొక్క వైభవం, ఆధ్యాత్మిక వైభవం లేకపోతే ఇవి అన్నీ సున్నలు. ఆత్మ యొక్క వైభవం ఉండి ఇవి అన్నీ ఉంటే నీకు ఏమీ నష్టం లేదు. ఇవి అన్నీ ఉండి ఆత్మ యొక్క వైభవం లేదు అనుకో ఒకటి లేని సున్నలతో సమానము. మీరు ఇంటి దగ్గర కూర్చొని ఎవరికి లేని ప్రత్యేకత నాకు ఉండాలి అనుకొంటారు అనుకోండి, అక్కడ నుండి అజ్ఞానం ప్రారంభమవుతుంది. నీవు ఇతరులకు ఇచ్చేది తిరిగి నీకే వస్తుంది అని తెలిస్తే ఇతరులకు ఏమీ ఇవ్వకుండా ఎంతకాలం ఉండగలవు. మీ దగ్గర పది వంకాయలు ఉన్నాయి అనుకోండి. ఇతరులకు ఇచ్చేటప్పుడు ఆ పది వంకాయలలో మంచివి ఇవ్వండి. దానికి ఈశ్వరుడు పొంగిపోతాడు. ఆ వంకాయలు తినే వాడిలో కూడా ఈశ్వరుడు ఉన్నాడు అది మర్చిపోవద్దు. ఈ చిన్న చిన్న పనులు చేయండి, మీకు మోక్షం వచ్చేస్తుంది. ఎందుచేతనంటే భగవంతుని దృష్టిలో చిన్నపనా, పెద్దపనా అని లేదు. లోపల ఏ సంకల్పంతో చేస్తున్నాము అది భగవంతుడు చూస్తాడు. అందరి మొఖాలలోను దేవుడినే చూడటం నేర్చుకోండి. వంకాయలు రేపు తిందాము, రేపు తిందాము అనుకొంటారు. ఈ లోపు కుళ్ళిపోతాయి. మీకు సరిపోతే తినేయండి. ఎవరికైనా ఇవ్వాలి అనుకొంటే మంచివి తీసి ఇవ్వండి. దానికి ఈశ్వరుడు పొంగిపోతాడు, ఆయన దయతో మిమ్మల్ని కప్పతాడు, వాడు కృష్ణుడు. ఎవరికైనా ఇచ్చేటప్పుడు మనం ఏరి, ఏరి చెడ్డవి ఇస్తాము. ఇదంతా ఈశ్వరుడు చూస్తున్నాడు. నీ శరీరానికి చెడ్డ అనుకొన్నది ఇంకో శరీరానికి మంచి ఎలా అవుతుంది. ఇటువంటి చిన్న చిన్న విషయాలలో జాగ్రత్తగా ఉంటూ, జీవిస్తూ ఉంటే మీకు పవిత్రత కలుగుతుంది, ఆత్మజ్ఞానానికి అర్హత కలుగుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-03-06, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు ఉగాది, నూతన సంవత్సరం. ఇది వ్యయనామ సంవత్సరం. ఈరోజు ఒకరి క్షేమం ఒకరు కోరుకొంటారు. మనం అందరి క్షేమం కోరుకొంటే మనం క్షేమంగా ఉంటాము. అందరూ శాంతిగా ఉండాలి అనుకొంటే మనం శాంతిగా ఉంటాము. అంతేగాని ఎవరూ శాంతిగా ఉండకూడదు, ఎవరూ సుఖంగా ఉండకూడదు. నేను ఒక్కడినే సుఖంగా,

శాంతిగా ఉండాలి అనుకొంటే కోటిజన్మలు ఎత్తినా నీకు సుఖం దొరకదు, ఒకవేళ కోట్ల రూపాయలు ఉన్నా నీకు సుఖం దొరకదు. ప్రపంచంలో ఏమీ లేదు. మనలో ఉన్నదే ప్రపంచంలో కనిపిస్తుంది. మన నిజమైన ఇల్లు మన హృదయంలోనే ఉంది. మన నిజమైన ఇంటికి మనం చేరుకొంటే పునర్జన్మలు ఆగిపోతాయి. మనం బయట దేవతలను పూజించటం ఎందుకు అంటే వారి అనుగ్రహంతో హృదయంలో ఉన్న వస్తువును తెలుసుకోవటానికే మనం చేస్తున్నాము. శివుడికి అభిషేకాలు చేసినా, విష్ణువుకు అలంకరించినా ఇవి అన్నీ కూడా హృదయంలో ఉన్న వస్తువును తెలుసుకోవటానికే మనంచేస్తున్నాము. కంచి పరమాచార్యులు అంటే నాకు హృదయంలో ఇష్టం ఉంది, నిరాడంబరంగా ఎలా జీవించాలో ఆయనను చూస్తే తెలుస్తుంది. నిరాడంబరంలోనే సౌందర్యం ఉంది. ఆయన రాత్రి నాకు స్వప్నంలో కనిపించి నా చేతిలో రెండు పండ్లు పెట్టారు. ఆయన పండ్లు ఇస్తున్నందుకు నాకు సంతోషంగా ఉంది కాని తీసుకోవటానికి సంకోచిస్తున్నాను కారణం తెలియదు. ఈ పండ్లు ఏమిటి అనుకొంటున్నావు 1. అందం, 2. సత్యం అన్నారు పరమాచార్య. సత్యమైనది ఎప్పడూ అందంగానే ఉంటుంది, అందమైనది ఎప్పడూ సత్యంగానే ఉంటుంది. రెండూ ఒక్కటే. అందం వేరు, సత్యం వేరు అనుకోవద్దు. ఒక్కటి అంటే ఒక్కటే, అద్వైతానుభవం. ఆ అనుభవం మనకు కలిగితే పూర్వజన్మలలో ఉన్న కర్మలు అన్నీ కాలిపోతాయి అని చెప్పారు. వర్షాకాలంలో మనం బయట కూర్చుంటే మన నెత్తిమీద వర్షం ఎలా కురుస్తుందో, సత్యానుభవం ఉన్నవాడిని మనం ఆరాధిస్తే మన కోరికలు కూడా అలా నెరవేరతాయి, శాస్త్రం జ్ఞానికి అంత ప్రాముఖ్యత ఇచ్చి చెప్పింది. ప్రారబ్ధాన్ని బట్టి దేహం వస్తుంది. దేహాభిమానం నశించింది అనుకోండి ప్రారబ్ధం కూడా నశిస్తుంది. కాల ప్రవాహంలో పుణ్య ప్రారబ్ధం వస్తూ ఉంటుంది, పాప ప్రారబ్ధం వస్తూ ఉంటుంది. పుణ్య ప్రారబ్ధం సుఖంగా ఉంటుంది, పాప ప్రారబ్ధం కష్టంగా ఉంటుంది. దేహాభిమానం ఉన్నవాడికి ప్రారబ్ధం యొక్క బాధ తెలుస్తుంది, దేహాభిమానం లేనివాడికి ప్రారబ్ధం యొక్క బాధ తెలియదు. భగవంతుడు దయామయుడు అంటున్నారు కదా మరి జీవుడికి పాప ప్రారబ్ధం ఎందుకు పెట్టాడు అంటే మన మీద జాలి లేకకాదు, దయ లేకకాదు, పాపప్రారబ్ధం అనుభవంలోనికి తీసుకొని రావటం కూడా ఆయన దయే అని చెప్పారు. ఎందుచేతనంటే పాపప్రారబ్ధం అనుభవించే వాడికి మనం భవిష్యత్‌లో జాగ్రత్తగా ఉండాలి అని వాడికి తెలుస్తుంది, ధర్మాన్ని ఆచరించాలనే బుద్ధి కలుగుతుంది. ధర్మాన్ని ఆచరించకుండా ధర్మ స్వరూపుడైన ఈశ్వరుడిని మనం పొందలేము. అందుచేత పాప ప్రారబ్ధం కూడా భగవంతుడి దయే, అది కూడా మంచిదే అని చెప్పారు. అది చెడ్డది అని మీరు అనుకోవద్దు. అవగాహన చేసుకొనేశక్తి లేకపోవటం వలన అది చెడ్డకింద మీకు

అనిపిస్తోంది అన్నారు.

వ్యయమంటే ఖర్చు, వ్యయనామ సంవత్సరంలో మనం ఏమి చేయాలి అంటే మన తలంపులను వ్యయం చేస్తున్నాము అనుకోండి అవి మనకు పుణ్యం తీసుకొని రావాలి. మన దగ్గర ఉన్న డబ్బు వ్యయం చేస్తున్నాము అనుకోండి, అది మనకు పుణ్యం తీసుకొని రావాలి. మన ఆలోచన, మాట, చేత, మనం ఏది చేసినా అది మనకు పుణ్యం తీసుకొని రావాలి, అది ఖర్చు అనుకోకండి, అది పుణ్యం కింద మారాలి. నేను బాహ్యంగా మీకు ఏమీ చేయలేక పోయినా మీరు క్షేమంగా ఉండాలి, సుఖంగా ఉండాలి, ఏమీ లోటు లేకుండా ఉండాలి అని నేను సంకల్పం చేస్తాను అనుకోండి, ఆ సంకల్ప ప్రభావం మీ మీద ఉంటుంది, నాకు పుణ్యం వస్తుంది, ఉభయతారకం. బంధంలో నుండి, అజ్ఞానంలో నుండి తేలికగా బయటకు వచ్చే ఉపాయం ఒకటి ఉంది అని పరమాత్మ చెపుతూ నద్వేష్టి, నకాంక్షతి అంటే ఏ వ్యక్తి మీద ద్వేషం పెట్టుకోవద్దు, ఏ వస్తువు మీద కాంక్ష పెట్టుకోవద్దు. మీ ప్రారబ్దంలో రావలసి ఉంటే అది వస్తుంది కాని కాంక్ష పెట్టుకోవద్దు. మీ కోరిక లేకుండా ఏదైనా వస్తే అది మిమ్మల్ని బంధించదు, కోరికతో తెచ్చుకొంటే అది మిమ్మల్ని బంధిస్తుంది. వారు ఎంత చెడ్డవారైనా వారి మీద ద్వేషం పెట్టుకోవద్దు. ద్వేషం పెట్టుకొంటే నీ మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది. దాని వలన నీవు నష్టపోతావు. ద్వేషం లేనివాడు, కాంక్ష లేనివాడు బంధంలో నుండి బహు తేలికగా సుఖంగా బయటకు వస్తాడు.

ఒకరు బాబాగారి దగ్గర ఎవరి గురించో మాట్లాడుతూ ఆయన చాలా ధనవంతుడు అని చెపుతాడు. బాబా ఏమన్నారు అంటే ఆయన కాలాన్ని, శక్తిని పాడుచేసుకొన్నాడు అని చెప్పారు. నీ మనస్సును బాగుచేసుకొంటే మంచిదే. భగవంతుడిని స్మరించగా, స్మరించగా ఆయన దయవలన నీవు పవిత్రుడవు అవుతావు. స్మరించటం వలననే నీవు పవిత్రుడవు అవ్వవు, ఆయన దయవలన నీవు పవిత్రుడవు అవుతావు. ఈ లాజిక్ మీరు అర్థం చేసుకోండి. నీ మనస్సును బాగుచేసుకోకుండా కేవలం డబ్బు సంపాదిస్తూ ఉంటే వాడి టైము వేస్టు, ఎనర్జీ వేస్టు అని చెప్పారు. ఎందుచేతనంటే మరణానంతరం నీ మనస్సు నీకూడా వస్తుంది. నీవు సంపాదించిన డబ్బు నీ కూడా రాదు. నీ శరీరమే నీ కూడా రానప్పుడు నీవు సంపాదించిన డబ్బు నీకూడా ఎలా వస్తుంది. ఆయన డబ్బు సంపాదించటానికి కష్టపడ్డాడు కదా మరి మనస్సును బాగుచేసుకోవటానికి ఏమైనా కష్టపడ్డాడా? ఆయన మనస్సును బాగుచేసుకొన్నాడేమో చెప్పండి, సంతోషిద్దాము. మనం ఏదైనా ఒక విషయం గురించి ఆలోచించినా, ఏదైనా ఒక మాట మాట్లాడినా అది అహంభావనలో నుండి బయటకు రావటానికి మనకు ఉపయోగపడాలి, నువ్వు మాట్లాడే మాటల వలన, నువ్వు చేసే పనుల

వలన, నీకు వచ్చే తలంపుల వలన ఏమైనా అహంభావన తగ్గుతోందా లేక అహంభావన పెరుగుతోందా అది చూసుకో, అది జాగ్రత్తగా పరిశీలన చేసుకో, అదే నిజమైన సాధన. కొంతమంది గొప్పల కోసం ఏవో మాట్లాడుతూ ఉంటారు. అవసరం ఉండి మాట్లాడటం లేదు, గొప్పలకోసం మాట్లాడుతున్నాము అని మనకు తెలియకపోయినా వాడికి లోపల తెలుస్తూ ఉంటుంది. గొప్పలకోసం మాట్లాడుతున్నాడు అనుకోండి ఆ రోజుకు ఆరోజు వాడి బ్రెయిన్ పాయిజన్ అయిపోతుంది, అహంభావన చేత బంధింపబడతాడు, అది కోటి జన్మలకు కారణం అవుతుంది. కేవలం గురువు అనుగ్రహం వలన సుఖం, శాంతి నీకు దొరకాలిగాని యజ్ఞయాగాదుల వలన మీకు శాంతి దొరకదు. ద్వేషం లేనివాడు, కాంక్ష లేనివాడు, రాగద్వేషముల నుండి విడుదల పొందినవాడు ఏమీ కష్టం లేకుండానే బంధంలో నుండి విడుదల పొందుతాడు. నేను మోక్షాన్ని పొందాలి అని వాడికి కోరిక లేకపోయినా ఈశ్వరుడు వాడిని మోక్షంతో అలంకరిస్తాడు.

దేహం చనిపోయే వరకు ప్రారబ్దకర్మ ఉంటుందా, దేహం ఉండగానే ప్రారబ్దకర్మలో నుండి బయటపడవచ్చా అని భగవాన్‌ను అడుగుతున్నారు. దేహం జీవించి ఉండగానే ప్రారబ్దకర్మ నుండి బయటపడవచ్చు. నీకు రూపబుద్ధి లేదు అనుకో ప్రారబ్దకర్మ నిన్ను ఏమి చేస్తుంది. రూపబుద్ధి ఉన్నవాడికి ప్రారబ్దకర్మగాని రూపబుద్ధి లేనివాడికి ప్రారబ్దకర్మ ఏమిటి? శరీరం ఉన్నవాడికి రోగం, శరీరం లేనివాడికి రోగం ఏమిటి? దేహము నేను అనుకొనేవాడికి ప్రారబ్దం. వాడు నశిస్తే ప్రారబ్దం ఏమిటి? దేహము నేను అనే తలంపు దాని మూలంలోనికి వెళ్ళి నశిస్తే వాడికి రూపబుద్ధి నశిస్తుంది, నామబుద్ధి నశిస్తుంది. రూపబుద్ధి నశించిన వాడికి ప్రారబ్దకర్మ ఏమిటి? వాడు ప్రారబ్దం అనుభవిస్తున్నట్లు చూసేవాడికి అనిపిస్తుంది అంతే. మన పూర్వజన్మల కర్మలు మంచివి కావు అనుకోండి. ఎంత పెద్ద గడ్డిమేటు అయినా చిన్న అగ్గిపుల్లకు లోకువ అలాగే నీకు జ్ఞానం కలిగితే నీకు పూర్వజన్మలలో పెద్ద గడ్డిమేటుల వంటి ప్రారబ్దకర్మలు ఉన్నా అవి అన్నీ కాలి బూడిద అయిపోతాయి, అది జ్ఞానం యొక్క వైభవం, జ్ఞానమే నిజమైన ఐశ్వర్యం. బాబాగారి దగ్గరకు ఒకరు వచ్చి నా నోరు మంచిది కాదు ఎప్పుడూ ఎవరో ఒకరిని విమర్శిస్తూ ఉంటాను, తిడుతూ ఉంటాను, ఆ అలవాటు పోవటం లేదు అన్నాడు. అప్పుడు బాబాగారు ఏమి చెప్పారు అంటే నువ్వు ఎవరినైనా తిట్టావు అనుకో వెంటనే రామనామం చేసుకో, కృష్ణనామం చేసుకో, భగవంతుడి నామం చేసుకొంటే నీపాడుబుద్ధి పోతుంది, తిట్టటం వలన వచ్చే పాపం కూడా పోతుంది అని చెప్పారు. మనం చెట్టు మొదలులో నీరు పోస్తే అది కొమ్మలకు, ఆకులకు, వేళ్ళకు, పండ్లకు, పుష్పాలకు అన్నింటికి ఆ నీరు వెళుతుంది అలాగే మీరు కృష్ణుడికి నమస్కారం పెడితే అది సమస్త దేవతలకు

వెళుతుంది. జ్ఞాని శరీరం ఉన్నా శరీరరహితుడు, నామం ఉన్నా నామ రహితుడు. నువ్వు ఎప్పుడైతే బ్రాహ్మీస్థితిని పొందావో అప్పుడు రూపబుద్ధిలో నుండి, నామ బుద్ధిలో నుండి నువ్వు జీవించి ఉండగానే విడుదలపొందుతావు. అప్పుడు నీ రూపాన్ని ఎవరైనా పూజించినా, నీ నామాన్ని పొగిడినా నీకు ఏమీ అనిపించదు. రూపం ఉండగా రూపరహితుడవు అవ్వాలి, నామం ఉండగా నామరహితుడవు అవ్వాలి, అప్పుడు వాడిని ప్రారబ్ధం ముట్టుకోదు. మీకు ఏదైనా కష్టం వచ్చింది అనుకోండి గాఢనిద్రలో నేను కష్టం అనుభవిస్తున్నాను అని ఏమీ అనుకోరు. గాఢనిద్రలో కూడా ఆ కష్టం ఉంది కాని కష్టం అనుభవిస్తున్నాను అనుకొనేవాడు గాఢనిద్రలో లేడు. వాడు మెలుకువ రాగానే వస్తున్నాడు, వచ్చి దేహాన్ని పట్టుకొంటున్నాడు. గాఢనిద్రలో నీకు వ్యక్తిభావన లేదు అక్కడ ఏ గొడవ లేదు. ఆ నిద్రాస్థితిని మాట మాటకు జాగ్రదవస్థలో జ్ఞాపకం పెట్టుకొని దానిని పొందు అంటారు భగవాన్. దేహం నేను అనే తలంపు వచ్చాక అన్నీ వస్తున్నాయి. గాఢనిద్రలో వాడు లేడు. జాగ్రదవస్థలో కూడా వాడిని లేకుండా చేసుకోగలిగితే అదే నీ కడసారి జన్మ.

భగవాన్ దగ్గరకు ఒకరు వచ్చి నాకు ఆత్మను తెలుసుకోవాలని ఉంది అన్నారు. నువ్వు ఆత్మవే కదా ఇంక తెలుసుకోవటం ఏమిటి అన్నారు. నువ్వు ఆత్మవే కాని ఇప్పుడు నీకు దేహం అనుభవంలో ఉంది, మనస్సు అనుభవంలో ఉంది, నేను ఆత్మను అన్న సంగతి నీకు అనుభవంలో లేదు. ఏ కారణాల వలన అది నీకు అనుభవంలో లేదో ఆ కారణాలను తొలగించుకోవటమే సాధన, అంతకంటే ఏమీ లేదు. మీకు డబ్బు తక్కువగా ఉంది అనుకోండి, చాలీచాలని సంసారాలు అనుకోండి, భగవంతుడు కావాలనే అలా ఇరుకున పెడతాడు. ఎందుచేతనంటే ఆయనను స్మరించుకోవటం కోసం, ఆవంపు పెట్టి మిమ్మల్ని అనుగ్రహించటం కోసం అలా చేస్తాడు. ధనం ఒకోసారి మదాన్ని పెంచుతుంది. కొంతమంది దుఃఖం వలన భగవంతుడిని స్మరించుకొంటారు, కొంతమంది దారిద్ర్యం వలన భగవంతుడిని స్మరించుకొంటారు. వీరు అదృష్టవంతులా, ధనం వలన మదం పెరిగినవారు అదృష్టవంతులా అని నేను చెప్పిన విషయం ఒక్కసారి అంతర్ముఖులై మీరు ఆలోచించుకోండి. నేను అనే తలంపు మన హృదయంలోనుండే వస్తోంది. నేను అనే తలంపు వచ్చాక మనస్సు వస్తోంది. మనస్సు వచ్చాక దేహం వస్తోంది, దేహం వచ్చాక లోకం వస్తోంది. లోకం వచ్చాక దేవుడు వస్తున్నాడు. ఏది వచ్చాక అన్నీ వస్తున్నాయో దాని మూలంలోనికి వెళితే ఏమీ లేదు, మనం మిగులుతాము, అదే ఆనందం, అదే సత్యం, అదే జ్ఞానం. మీరు పబ్లిసిటీ కోసం పనిచేస్తే పబ్లిసిటీ వస్తుంది కాని ఈశ్వరునిదయకు నువ్వు పాత్రుడవు కాలేవు. ప్రజాసేవ అంటే ఏమిటో తెలియని వారు కూడా ఫొటోలో పడటంకోసం ముందుకు వెళ్ళిపోతారు. కనీసం మనస్సులో కూడా

వారు ఇతరుల క్షేమం కోరరు. వారు లోకానికి దగ్గరగా ఉంటారు, దేవుడికి దూరంగా ఉంటారు. వారు చేసేది తింగరపనులు అని వారికి తెలియటంలేదు. ఇటువంటి వారి గురించి క్రీస్తు ఒకమాట చెప్పాడు. ఓ తండ్రీ వారు ఏమి చేస్తున్నారో వారికి తెలియదు, వారిని క్షమించి ఆశీర్వదించు అన్నాడు. మీలో ఎవరైనా పబ్లిసిటీ కోసం 100 మంచి పనులు చేసారు అనుకోండి, కొంతమంది అసలు మంచి పనులు చెయ్యలేదు అనుకోండి, వారు ప్రశాంతంగా ఉండి మనస్సులో లోకక్షేమం కోరుకొంటున్నారు అనుకోండి, లోకక్షేమం కోసం ఆలోచిస్తున్నారు అనుకోండి, బాహ్యంగా పబ్లిసిటీ కోసం మంచిపనులు చేసిన వారి పేరు కలకాలం ఉండదు, మీ తలంపులు లోకక్షేమం కోసం దాని చుట్టూ తిరుగుతూ ఉంటే వారి పేరు చిరస్థాయిగా ఉంటుంది. ఈరోజు రామకృష్ణుడు గురించి, బుద్ధుడి గురించి ఎందుకు చెప్పకొంటున్నాము. బుద్ధుడు ఎక్కడయినా నుయ్యి తవ్వించాడా? ఆస్పత్రి కట్టించాడా? లేదు. అది వారి ప్రేమలో ఉన్న వైభవం, జ్ఞానం యొక్క వైభవం.

ఎక్కడయితే వ్యక్తిభావనలేదో, ఎక్కడయితే దేహభావన లేదో వాడి దేహాన్ని ఉపయోగించుకొని ఈశ్వరుడు పనిచేస్తూ ఉంటాడు. వాడు గొప్ప పనులు చేస్తున్నాడు అని మనం అనుకొంటాము, అక్కడ చేసేది ఈశ్వరుడే. మీరు మంచిపని చేసారు అని ఒకరితో అంటే నేను ఏమిటి చేయటం, సంకల్పం ఈశ్వరుడిది, ఈ శరీరం ద్వారా చేయించుకొన్నాడు. నేను చేయటం ఏమిటి అన్నాడు. దేహానికి సంబంధించిన చావు గురించి ఆలోచించవద్దు, అది ఏదోరోజు చనిపోతుంది. అహంభావనకు ఎప్పుడు చావు వస్తుంది అని చూడండి, దానికోసం ప్రయత్నం చేయండి. ఎప్పుడైతే అహంభావన నశించిందో అప్పుడు మీరు చైతన్యంలో ఐక్యమవుతారు. ప్రపంచంలో ఉన్న వస్తుజాలం అంతా మనకు బయటే ఉంది, మన దేహం కూడా మనకు బయటే ఉంది. అందుచేత అది మన కూడా రాదు. పూర్వజన్మలలో దేహాభిమానంతో అనేక కర్మలు చేసి ఉండవచ్చు. ఆ కర్మ అంతా ఈ జన్మలోనే రాదు. మొత్తం ఇస్తే ఈ శరీరం భరించలేదు. ఈ శరీరంలో ఎంత అనుభవించ గలవో అంతే ఇస్తాడు. కొంతపుణ్యం ఉండవచ్చు, కొంత పాపం ఉండవచ్చు. ఈలోపు నీవు సాధన చేసి గురువు అనుగ్రహం వలన దేహాభిమానాన్ని పోగొట్టుకొంటే ప్రారబ్ధం, ఆగామి, సంచితం అంతా పోతుంది. అది జ్ఞానం యొక్క వైభవం. భగవంతుడు చెప్పిన మాటలు మనం వింటున్నాము. విన్న మాటలను మననం చేసుకోవాలి, వాటిని అనుభవంలోనికి తెచ్చుకోవాలి, అప్పుడు వారికి అన్ని కర్మలు నశిస్తాయి. అప్పుడు వాడు చేసిన చేయని వాడితో సమానము. మీరు బాహ్యంగా చేసే పనులను భగవంతుడు చూడడు. పనిచేసేటప్పుడు లోపల మీ భావన ఏమిటి అది చూస్తాడు. లోకంలో రకరకాల మనుషులు ఉంటారు. మీ

ఇంట్లో మీ మాట ఎవరైనా కాదంటే నా మాట ఎవరు వినటంలేదు అని వెంటనే క్షోభ వచ్చేస్తుంది. లోపల మీ మనస్సు హింసపడిపోతుంది. భగవంతుడు చెప్పిన మాటలు మీరు వినరు అనుకోండి ఆయన ఏమీ వికారం పొందడు, నిదానంగా ఉంటాడు, ద్వైతం లేకుండా ఉంటాడు. ఎట్టిపరిస్థితులలోను మానసికఒత్తిడి రాకుండా చూసుకోండి. మనస్సు పొంగిపోకూడదు, మనస్సు కుంగిపోకూడదు, ఎప్పుడూ సమానంగా ఉండేటట్లు చూసుకోండి. ఇతరులను పరిశీలించటం కాదు మిమ్మల్ని మీరు పరిశీలించుకోండి, మీరు అంతర్ముఖులై మిమ్మల్ని మీరు చూసుకోండి. జ్ఞానం సంపాదించుకోవటానికి కృషి చేయండి.

మీరు ఒకరితో ఒకరు కలిసి ఉంటున్నారు కదా. ఆ ఉండేది ఏదో భగవంతుడితో కలిసి ఉండండి అంటున్నారు భగవాన్. మీ గురించి మీరు ఆలోచించుకోవటం తగ్గించే కొలది భగవంతుడు మీ గురించి ఎక్కువ ఆలోచిస్తాడు. మీ నెత్తిమీద భారం వేసుకోవద్దు. ఆయన మీద భారం వేసి మీరు శాంతిగా ఉండండి. మీరు భగవంతుడికి దూరం అయిపోతున్నారు అనుకోండి. ఒకోసారి మీ మనస్సుకు దుఃఖం కలిగించవచ్చు, ఒకోసారి మీ ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు రావచ్చు. మీకు దుఃఖం కలిగించినా, ఆర్థిక బాధ కలిగించినా ఇదంతా ఆయన ఒడిలోనికి మిమ్మల్ని తీసుకోవటానికే చేస్తున్నాడు, ఇదంతా ఈశ్వరుని లీల అంతేకాని మీరంటే ఇష్టంలేక కాదు. కర్మ జీవుడు చేస్తాడు, కాని ఆ కర్మ ఫలితాన్ని జీవుడికి ఎప్పుడు అనుభవంలోనికి తీసుకొని రావాలి అని నిర్ణయించేది ఈశ్వరుడే. నిర్వాణ సుఖం ఒక్కటే నిజమైన సుఖం. నువ్వు అన్ని విధముల ప్రయత్నం చేసి, సత్పురుషులతో సహవాసం చేసి, వారి అనుగ్రహాన్ని సంపాదించి నిర్వాణసుఖాన్ని పొందు అని ఆనంద్‌తో బుద్ధుడు చెపుతాడు. బాహ్యంగా ఏదో గొప్ప కర్మలు చేస్తే సరిపోదు. అహంభావన అనే దీపం ఆరిపోకుండా నీకు నిర్వాణసుఖం రాదు అని బుద్ధుడు చెప్పాడు. ఆశ అనే దీపం ఆరిపోయిన తరువాత కదా నీకు ఆత్మజ్ఞానం కలిగేది. బుద్ధుడి టైములో అంగుళీమాళుడు అని ఒకడు అనేక వందలమందిని చంపాడు. అతనితో బుద్ధుడు అంటాడు నీవు అనేక మందిని చంపావు, వారిని జయించాను అనుకొంటున్నావు. నీ అహంభావనను నువ్వు చంపుకోలేదు, ఇంక నీవు సాధించింది ఏమిటి అంటాడు. తరువాత బుద్ధుడితో సహవాసం వచ్చాక వాడు బుద్ధుడి మీద పరిపూర్ణవిశ్వాసం పెట్టుకొన్నాడు. బుద్ధుడితో సహవాసం వలన, ఆయన మీద పరిపూర్ణవిశ్వాసం పెట్టుకోవటం వలన వాడు నిర్వాణసుఖాన్ని పొందాడు. బుద్ధుడి శరీరం ఉండగానే వాడు చనిపోయాడు. అక్కడ ఉన్నవారు బుద్ధుడితో వాడు పూర్వం చాలామందిని చంపాడు, వాడు నరకానికి వెళతాడా అని బుద్ధుడిని అడిగారు. వాడు నరకానికి వెళ్ళడు, వాడు స్వర్గానికి వెళ్ళడు, వాడు నిర్వాణసుఖాన్ని పొందాడు అని బుద్ధుడు

చెప్పాడు. అంటే బుద్ధుడితో సహవాసం వలన వాడి కర్మ అంతా కాలిపోయింది. బుద్ధుడు తాను నిర్వాణసుఖాన్ని పొందటమే కాకుండా, ఆయన మీద విశ్వాసం వలన అంగుళీ మాళుడి చేత పొందింపచేసాడు. బుద్ధుడు ప్రసన్నాత్ముడు. ఆయనను చూసి, దర్శన మాత్రం చేతనే అనేకమంది నిర్వాణసుఖాన్ని పొందారు, అది జ్ఞానం యొక్క వైభవం. కొంతమంది కీర్తి పిచ్చివాళ్ళు ఉంటారు, గౌరవం సంపాదించాలి అని అనుకొంటూ ఉంటారు, గౌరవం సంపాదించాలనుకొనేవాడు ఎంత కష్టపడి ఆ గౌరవం సంపాదించుకొంటాడో అలాగ అన్ని విధముల ప్రయత్నం చేసి నువ్వు ఆత్మజ్ఞానాన్ని సంపాదించు అని పరమాత్మ చెపుతున్నాడు.

వేపపువ్వు పచ్చడి అంటే కొంచెం చేదుగా, కొంచెం తియ్యగా ఉంటుంది. అలాగే జీవితంలో కష్టం ఉంటుంది, సుఖం ఉంటుంది. కష్టసుఖాల మిశ్రమమే జీవితం. ఈ రెండూ బేలెన్స్ చేసుకొంటూ మనం జీవించాలి. అందుకే వేపపువ్వు పచ్చడి మన చేత తినిపించటం. ఏ కారణం వలన అయినా మీరు దుఃఖప్రారబ్ధం అనుభవిస్తున్నా కంగారు పడవద్దు. మీ దుఃఖప్రారబ్ధం మీకు ధర్మబుద్ధిని, జ్ఞానాన్ని కలుగజేయవచ్చు. అనుభవించే టప్పుడు మీకు కొంచెం చేదుగా ఉన్నా తరువాత తియ్యగా ఉంటుంది. అందుచేత మీరు వేగిరపడవద్దు, భగవంతుడిని తిట్టిపోసుకోవద్దు. దుఃఖప్రారబ్దం కూడా మిమ్మల్ని అనుగ్రహించ టానికే అని మీరు మర్చిపోకండి. మీకు ఎంత దుఃఖప్రారబ్దం ఉన్నా మీకు రూపబుద్ధి, నామ బుద్ధి లేకపోతే అది మిమ్మల్ని ఏమి చేస్తుంది, అది అంతా కాలి బూడిద అయిపోతుంది అంటున్నారు భగవాన్. ఎంత అద్భుతంగా ఉందో చూడండి. అంతర్ముఖుడు కానివాడికి ఆత్మజ్ఞానం కలుగదు. మీరు భౌతికంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే మీరు అంతర్ముఖులవ్వాలి. అంతర్ముఖుడు కానివాడికి ఈ లోకం లేదు, పరలోకం లేదు. నువ్వు కళ్ళు మూసుకోనక్కరలేదు, చెవులు మూసుకోనక్కరలేదు, నీవు ఈ ప్రకృతిని విశదంగా పరిశీలించు. ప్రపంచంలో ఉన్న మనుషలను, సంఘటనలను సాత్వికబుద్ధితో పరిశీలిస్తే నీకు వివేకం పెరుగుతుంది, వైరాగ్యం పెరుగుతుంది. వివేకం, వైరాగ్యం హృదయంలో ఉన్న నిజమైన ఇంటికి నిన్ను తీసుకొనిపోతాయి. ప్రతిఘటన వద్దు, ప్రకోపం వద్దు. లోకంలోని సంఘటనలను నీ కళ్ళతో చూడుకాని సాత్వికంగా చూడు, మాటలు విను కాని సాత్వికంగా విను. సాత్వికబుద్ధితో ఈ క్రియేషన్‌ను పరిశీలించటం నేర్చుకొంటే క్రియేటర్ దగ్గరకు వెళ్ళి పోతావు. ఈ సృష్టికి ఎవడైతే ఆధారమో వాడి పాదాలను చేరుకొంటావు. ఇంక ఈ శరీరం అనే అద్దె కొంపలలోనికి రానక్కరలేదు. ఈ ప్రకృతిని సాత్వికబుద్ధితో చూస్తూ పాఠాలు నేర్చుకొని బాగుపడు. ఈ వ్యయనామ సంవత్సరంలో మీ మాటలు, మీ పనులు, మీ తలంపులు ఏది వ్యయం చేసినా మంచికే చెయ్యండి, అది వ్యయనామ సంవత్సరం చెప్పే బోధ.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | |
|---|---|
| 11-05-06 గురు | భీమవరం, వెంకటేశ్వర స్వామి దేవాలయం |
| 17-05-06 బుధ | గుమ్మలూరు, క్షత్రియ కళ్యాణ మండపం |
| 21-05-06 ఆది | పాలకొల్లు, క్షత్రియ కళ్యాణ మండపం |
| 24-05-06 నుండి 01-06-06 వరకు | అరుణాచలం క్యాంపు |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

## ఆత్మలో సువాసనలు - మనస్సులో దుర్వాసనలు

సమత్వంగల జ్ఞానికి ఆశ్చర్యం, గర్వం, సమ్మోహం, దూషభూషణలు ఎన్నటికీ కలుగవు. నిర్భయత్వము, నిత్యత్వము, జ్ఞానము, నిరపేక్ష, నిష్క్రియత్వము, నిర్వికల్పము, ధైర్యము, మైత్రి, సుబుద్ధి, తృప్తి, శాంతి, మృదుభాషణలు మొదలగు సువాసనలతో నిండి ఉంటాడు. సర్వకాల సర్వ అవస్థలలోనూ ఈ ప్రపంచం అసత్యమని నిశ్చయించి ధృడంగా ఉంటాడు. అడిగిన చోట ఉపయోగకరమైన మాటలు పలుకుతాడు. రాగ ద్వేష విముక్తుడైనవాడు దుఃఖితుడు కాడు. ఎచ్చట మనస్సు ఉంటుందో అచ్చట స్మశానమందు కాకులవలె అనేక రకములైన ఆశలు, ప్రకృతి సుఖదుఃఖాలు వచ్చి చేరుతాయి. కోరిక అనే పిశాచంచే సేవింపబడింది, అనంతకోటి దేహాలను ధరించి అజ్ఞానమనే మహా అరణ్యంలో సంచరిస్తూ చిత్త చాపల్యకారణమైనది, ఇది అజ్ఞానులలో ప్రత్యక్షంగా కనబడుతుంది. తన దేహ రూపాన్ని నిరంతరం తింటూ ఉండటం వల్ల అమంగళమై ఉంటుంది. కోరికలనే తృష్ణచే అన్ని దిక్కులలోనూ సంచరించటం వల్ల శ్రమతో పీడించబడుతూ ఉంటుంది. అవమానం, ధనవ్యయం, శోకం, భయాదులనే కాకుల ముక్కులచే పొడవబడి, క్షోభతో పొర్లాడుతూ ఉంటుంది. తిరిగి శక్తి పుంజుకోవటానికి విషయ భోగాలనే మాంసాన్ని తింటుంది, రోగాలతో కూడిన భోగాలు అంటే దీనికి బలే సరదా. దృశ్యాల ఆస్వాదనకోసం అన్ని దిక్కులను చూస్తూ ఉంటుంది. పంది బురద మెచ్చుగాని పన్నీరు మెచ్చుతుందా! ఎండు చేపల వర్తకులకు మల్లెపూల పందిర దగ్గర పక్క వేసినా నిద్రపడుతుందా? భయంకరమైన కోరికలను ధరించే ఈ మనస్సు దేహాభిమానమనే వటవృక్షం నీడ నుండి ఎప్పుడు ఎగిరిపోతుందో అప్పడే దానికి అన్ని విధాలైన జయాలు కలుగుతాయి. శ్రీనాన్నగారు "దైవీ జివితంలో వ్యాపారం ఉందడు, కోరిక ఉండదు ప్రేమ ఉంటుంది. నీలోని ఆనందాన్ని అప్రయత్నంగా అనుభవించటమే సమాధి" అన్నారు. కాబట్టి దుర్వాసనలతో కూడిన ఈ చిత్త పిశాచాన్ని వివేక, వైరాగ్యాలతో నిరంతర జాగరూకతతో జీవిస్తే ఇందుండి బయట పడగలము. గురు సన్నిధిలో ఉన్నంత చల్లని నీడ, సువాసనలు ఈ ప్రపంచంలో ఎక్కడా కనిపించవు. ప్రకృతి మనసులతో జాగ్రత్త అంటుంది గురుప్రేమ. ఆ గురు ప్రేమలో జీవించాలి, తరించాలి.

**- సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం

# సద్గురు శ్రీ నాన్నగారి దండకం

శ్రీ నాన్నగురుదేవా ఆనంద చిద్భావా శ్రిత భక్త
ప్రియ బాంధవా, కనులకజ్ఞాన తిమిరమ్ము తొలగించి
కరుణించు లోకైక దీపాంకురా! ఈ ధరిత్రిన్
శిష్టులన్ బోధతో దుష్టులన్ సకల జన సంఘమున్,
కాచి రక్షించి పాలింప సాక్షాత్ ఆ దివ్య అరుణగిరి నాధుడే
రమణఋషి రూపాన నీ పైన కరుణించి ప్రియ శిష్యునిగ
ఎంచి స్వప్నాన అరుదెంచి ప్రియమార దీవించు
మహిమోన్నతంబౌ, ఆ ఘటన వినినంతనే.....
మాదు ఒడలంత పులకించి మదిలోన మిమ్మింక
సద్గురువుగా ఎంచి కైమోడ్పు విడినామయా!

వరపుణ్య గోదారి తటవర్తియై వెలుగు
జిన్నూరు గ్రామాన్ని చెన్నొందు ఆధ్యాత్మ అద్వైత శిఖరాగ్రగ
ఆంధ్ర అరుణాచలము మాడ్కి, సంక్షేత్రమును చేసి
అతి భక్తి మిము చేరు భక్తాళి భవతాపమున్,
మీదు పీయూష వాగ్ధారలన్ అంతమొందించి
ఆతాప పాపౌఘముల్, మదిని వేడంగ చిత్తమున
మిము కొల్చువారికన్, దర్శించు ప్రతి వారికిన్
ఏవేళ కలిగించు మీ దయల మీ కృపల ఘన కీర్తి
దాటి పోనట్టి ఎల్లలున్ సీమలున్ గలవే!
కర్మ శేషంబుతో మిము జేరు మానవుల దుఃఖంబులన్
బాపి రక్షించు మీ లీలలవి ఎన్నంగ మాశక్యమే!

ఇహలోక సౌఖ్యములన్ కోరి మీ కడకు
అడుగిడిన భక్తులన్, తొలుత మృదుమందహాసంబునన్
శాంత చిత్తులన్, చేసి పిదప అంతర్ముఖం జేసి,
భవబంధ ముక్తులన్ గావించి జన్మ కడతేర్చు
ఆ ఆత్మ జ్ఞానమున్ కరతలామలక మగునట్లు
కరుణించు సద్భక్త చింతామణీ!

నేడు నీ దివ్య పాదాంబుజములే కాక
దిక్కేది లేదనుచు, శరణింక నీవనుచు
నీ చెంతకున్ చేరు భక్త కోటిన్ సదా దయతో
కాపాడు..... ఓ దీన బంధూ........ దయా సింధూ........
........శ్రీ నాన్న గురుదేవా నమస్తే........ నమస్తే...... నమః